క్లుప్తంగా

గోండుగోవారీలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో నివసిస్తున్న గోండు గోవారిలను ఎస్టీ జాబితాలో చేర్చాలని స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ కలిసి విన్నవించారు. హైదరాబాదులో బుధవారం కులసంఘ సభ్యులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నీటి సమస్య తీర్చాలని వినతి

బోథ్: మండల కేంద్రంలోని పలు కాలనీల్లో నెలకొన్న నీటి ఎద్దడిని నివారించాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. బుధవారం ఎంపీడీవో రమేశ్, ఈవో అంజయ్యలకు వినతిపత్రం అందించారు. నీటి ఎద్దడి నెలకొనడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు సురేందర్ యాదవ్, శ్రీధర్ రెడ్డి, నాయకులు ఎలక మెడిచేల్మ ప్రవీణ్, బొడ్డు శ్రీనివాస్, స్వామి, రమణ, రమేశ్, రూప్‌చంద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించేలా అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదించడం హర్షనీయమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తు బుధవారం జైనథ్ మండల కేంద్రంలో సంబురాలు జరుపుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. డప్పుచప్పుళ్ల మధ్య నృత్యం చేశారు. ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకుందన్నారు.

పనులు వేగవంతం చేయాలి

ఇచ్చోడ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. బుధవారం మండలంలోని నవేగావ్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ప్రభుత్వం నవేగావ్ గ్రామాన్ని మోడల్ గ్రామంగా ఎంపిక చేసి అర్హులైన 81 మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసిందన్నారు. వేగంగా నిర్మాణలు చేసుకోవడం ద్వారా ప్రభుత్వం నుంచి తొందరగా బిల్లులు మంజూరు అయ్యే అవకాశం ఉందన్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

ఆదిలాబాద్‌టౌన్: వైకల్యం గల విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఆదిలాబాద్ అర్బన్ మండల విద్యాధికారి సోమయ్య అన్నారు. బుధవారం ఆదిలాబాద్ పట్టణంలోని డైట్ కళాశాల ఆవరణలో భవిత రిసోర్స్ సెంటర్‌లో ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవసరమైన వస్తువులు పంపిణీ చేశారు. 36 మంది చిన్నారులకు 151 రకాల లర్నింగ్ మెటీరియల్ అందించారు. దివ్యాంగుల పట్ల చిన్నచూపు చూడవద్దని సూచించారు. కార్యక్రమంలో డైట్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు లచ్చిరాం, లక్ష్మణ్, పుష్పవేణి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని చేరుకోవాలి

సిరికొండ: విద్యార్థులు ఇష్టపడి చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని ఎస్సీ, ఎస్టీ మహిళా కమిషన్ సభ్యురాలు నీలాదేవి అన్నారు. బుధవారం మండలంలోని రాయిగూడ గిరిజన ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు సంప్రదాయ నృత్యాలు, పాటలు, నాటికలు ఆలరించాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఆత్రం భాస్కర్, ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ అంబాజీ, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులతో సమావేశం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ రూరల్ మండలం రామాయిలో నిర్మించనున్న రేణుకా సిమెంట్ ఫ్యాక్టరీ భూ నిర్వాసితులకు ఆరు నెలల్లోగా న్యాయం జరిగేలా చూస్తామని జిల్లా ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫ్యాక్టరీ యాజమాన్య ప్రతినిధులు, రామాయి రాంపూర్ గ్రామ భూనిర్వాసితులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సిమెంటు ఫ్యాక్టరీని ఆరు నెలల్లోగా ప్రారంభిస్తామని ఫ్యాక్టరీ ప్రతినిధులు తెలుపడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో ఆర్డీవో వినోద్ కుమార్, బీజేపీ నాయకురాలు సుహాసిని పాల్గొన్నారు.

శనగ కొనుగోళ్లు చేపట్టాలని నిరసన

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): జైనథ్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనగ కొనుగోళ్లను వెంటనే చేపట్టాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని అంతరాష్ట్ర రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ శనగ కొనుగోళ్లను ప్రారంభించి మూడు రోజులవుతున్నా.. ఇప్పటి వరకు పంటను కొనుగోలు చేయకపోవడంపై మండిపడ్డారు. మార్కెట్‌యార్డులో కూలీల నుంచి డబ్బులు వసూలు చేయడం సరికాదన్నారు. టీఆర్ఎస్ హయాంలో ప్రతీగింజ కొనుగోలు చేశామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మార్శెట్టి గోవర్దన్, గణేష్ యాదవ్, వెంకట్ రెడ్డి, భోజన్న, పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.

‘కంది’పై ఆసక్తి..!



సావర్గాం శివారులో సాగు చేసిన కంది పంట

- యాసంగిలో పెరిగిన సాగు
- పంటకు ఉన్న డిమాండ్ కారణం
- కలిసివచ్చిన కాలం
- తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడికి అవకాశం

తాంసి: యాసంగి సీజన్‌లో మండలంలోని రైతులు అధికంగా రెండో పంటగా కందిపంట సాగు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా యాసంగిలో రైతులు కంది సాగుకు ముందుకొచ్చారు. ఈ సీజన్‌లో తాంసి, భీంపూర్ మండలాల్లో రైతులు కంది పంటను ఎక్కువగా సాగు చేశారు. కంది పంట సాగులో కూలీల అవసరం ఎక్కువగా ఉండకపోవడం.. నీటి తడులు తక్కువగా అవసరం ఉండి దిగుబడి ఎక్కువగా వస్తుండటంతో యాసంగిలో కంది పంట సాగుకు రైతులు మొగ్గు చూపారు. ప్రస్తుతం తాంసి, భీంపూర్ మండలాల్లో ఆయా గ్రామాల శివారులోని పంటచేలలో కంది పంట సాగు ఆశాజనకంగా ఉంది. సాగు చేసిన కంది పంట కొన్ని చోట్ల పూత,కాత దశలో ఉండగా మరికొన్ని చోట్ల దిగుబడి వచ్చే దశకు చేరింది. పంటసాగుకు కాలం సైతం అనుకూలంగా ఉండటంతో మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన కంది సాగు..

గతంలో రైతులు యాసంగి సీజన్‌లో అధికంగా శనగ, జొన్న, గోధుమ పంటలను సాగు చేసేవారు. ప్రస్తుతం కంది పంటకు డిమాండ్ ఉండటం, మద్దతు ధరకు కొనుగోలు చేస్తుండటంతో యాసంగిలో రైతులు కందిపంట సాగు వైపు మళ్లారు. దీంతో గతేడాది కంటే ఎక్కువగా కంది పంట సాగు విస్తీర్ణం పెరిగింది. వానాకాలం సీజన్‌లో పత్తి, సోయా పంటలలో కంది పంటను అంతరపంటగా వేసి సాగు చేస్తారు. దీంతో పంట సరైన నిర్వహణ లేక దిగుబడి అంతగా రాని పరిస్థితి ఉంటుంది. వానాకాలంలో అంతర పంటగా సాగు చేసిన కంది పంట ఎకరానికి దాదాపుగా 3 నుంచి 4 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. యాసంగిలో సాగుచేసిన కందిపంట అంతరపంటగా కాకుండా సాగు చేయడంతో దిగుబడి సైతం ఎక్కువగా వస్తోంది. ఎకరానికి 6 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది.

100 ఎకరాలకు పైగా సాగు..

తాంసి, భీంపూర్ మండలాల వ్యాప్తంగా 100 ఎకరాలకు పైగా కంది సాగు చేశారు. తాంసి, జామిడి, కప్పర్ల, నిపాని, వడ్డాడి, పొన్నారితో పాటు పిప్పల్‌కోటి, అంతర్గాం, గోముత్రి తదితర గ్రామాల్లో కంది పంటను ఎక్కువగా సాగు చేశారు. వానాకాలం సాగుచేసిన కంది పంట సాగు కాలం ఆరు నెలలకు పైగా ఉంటుంది. ఈ సీజన్‌లో సాగుచేసిన పంట సాగు కాలం 110 రోజులు మాత్రమే ఉంటుంది. తక్కువ కాలంలో పంట చేతికిరావడంతో పాటు ఎత్తు తక్కువ పెరిగి, దిగుబడి సైతం అధికంగా ఉండటంతో రైతులకు మేలు జరుగుతుంది. యాసంగిలో వర్షాలు కురిసే అవకాశం లేనందున పూత, కాత రాలకుండా ఉండి, పంటకు తెగుళ్లు కూడా సోకకపోవడం రైతులకు కలిసి వస్తోంది. దీంతో పెట్టుబడి తగ్గి, దిగుబడి పెరిగి లాభాలు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.7550 మద్దతు ధర ఉంది.

పది క్వింటాళ్ల దిగుబడి



గత రెండేళ్లుగా యాసంగిలో కంది పంట సాగు చేస్తున్నాను. గతేడాది సాగు చేసిన కంది పంట ఎకరానికి పది క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. ఈ ఏడాది కూడా ప్రస్తుతం రెండు ఎకరాలు వేశాను. యాసంగిలో కంది సాగు సులభంగా ఉంటుంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభం పొందవచ్చు. శనగ పంట సాగు కంటే కంది సాగు చేస్తే రైతులకు మేలు జరుగుతుంది.

– గడ్డం నిఖిల్ రెడ్డి, రైతు, జామిడి

గతేడాది కంటే



గతేడాది కంటే ఈ యాసంగిలో రైతులు ఎక్కువగా కంది పంట సాగు చేశారు. సాగునీటి సదుపాయం ఉన్న రైతులు శనగ, జొన్నతో పాటు కంది వేశారు. కంది పంటకు వ్యాప్తి చెందే తెగుళ్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏఈవోల ద్వారా అవగాహన కల్పించాం. ప్రస్తుతం సాగు చేసిన పంట దిగుబడి వచ్చే దశలో ఉంది. వానాకాలం కంటే యాసంగిలో దిగుబడి ఎక్కువగా వచ్చే అవకాశం ఉండటంతో రైతులు ఎక్కువగా కంది వేస్తున్నారు.

– రవీందర్, మండల వ్యవసాయాధికారి, తాంసి

‘బీసీ బిల్లు దేశానికే మార్గదర్శకం’



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

తలమడుగు: బీసీ రిజర్వేషన్ బిల్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం తెలుపడం సీఎం రేవంత్ రెడ్డి దేశానికి ఆదర్శమని బోథ్ నియోజవర్గ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. బుధవారం మండలంలోని సుంకిడి గ్రామంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దశబ్దాల సమస్యకు పరిష్కారం సీఎం రేవంత్ రెడ్డి చొరవ చూపడంతో పాటు నిరుద్యోగులకు స్వయం ఉపాధి కోసం రాజీవ్ యువ వికాసం పథకం కింద 6000 రూ. కోట్లు మంజూరు చేశారని అన్నారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయంగా, విద్య, ఉద్యోగపరంగా రిజర్వేషన్లు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, మాజీ ఎంపీపీ కల్యాణం లక్ష్మి రాజేశ్వర్, ప్రవీణ్ రెడ్డి, వెంకట్ యాదవ్, రాములు పాల్గొన్నారు.

తాంసి: ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్ అమలు చేయడం చారిత్రత్మక నిర్ణయమని కాంగ్రెస్ బోథ్ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చారిత్రత్మక నిర్ణయాలు తీసుకుంటున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గణేశ్ రెడ్డి, సంతోశ్, పోతారెడ్డి, అశోక్, శ్రీధర్ రెడ్డి,రామన్న యాదవ్, వెంకట్ రెడ్డి, ధనుంజయ్ పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల అత్యుత్సాహం

- అనుమతి లేకుండా కవ్వాల్ టైగర్‌జోన్‌లో పనులు

నేరడిగొండ: విద్యుత్ శాఖ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల గోవింద్‌పూర్ అటవీ ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న భూముల్లో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి తీగలు బిగించారు. అయితే ఇది కవ్వాల్ టైగర్‌జోన్ పరిధిలోకి వస్తుంది. ఈ ప్రాంతంలో ఎలాంటి విద్యుత్ పనులు చేపట్టరాదనే ఆంక్షలు ఉన్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా పనులు చేపట్టడంపై నేరడిగొండ ఏఈ నాగేంద్రప్రసాద్‌కు అటవీశాఖ అధికారులు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. మంగళవారం అరెస్టు చేసేందుకు అటవీ శాఖాధికారులు రాగా, అక్కడే ఉన్న విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ జైవంత్‌రావు చౌహాన్ డీఎఫ్‌వో ప్రశాంత్ పాటిల్‌తో ఫోన్‌లో మాట్లాడి రెండు రోజుల సమయం అడిగారు. సాయిదత్త కన్‌స్ట్రక్షన్స్‌కు సంబంధించిన వారు విద్యుత్ వైర్లు, స్తంభాలను వేశారు. కిందిస్థాయి ఉద్యోగులు కొంత మంది మామూళ్లకు అలవాటు పడి ఇలా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నారు.

మందకృష్ణ పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

బోథ్: మందకృష్ణ మాదిగ పోరాటం ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ చట్టం జరిగిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కుడాల స్వామి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ ఆమోదం పొందిందంటే దానికి కారణం మందకృష్ణ మాదిగని పేర్కొన్నారు. ఈసందర్భంగా బోథ్ నియోజకవర్గ కేంద్రంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ప్రతీ ఇంట్లో మందకృష్ణ మాదిక ఫొటో పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కారం రవి, అన్వేపగా అశోక్, జెల్ల సురేందర్, మహేశ్, సుభాష్, లక్ష్మణ్, దశరథ్, రాజు, అనిల్, గంగాధర్, నగేశ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

‘హామీలు విస్మరించిన కాంగ్రెస్’

బోథ్: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ విస్మరించిందని బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ ఆరోపించారు. బుధవారం సొనాల మండలంలోని పార్డి (బి) గ్రామంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి దాదాపు 15 నెలలు గడుస్తున్నా.. హామీలను అమలు చేయడం లేదన్నారు. రుణమాఫీ, రైతుబంధు ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. మహిళలకు ఇవ్వాల్సిన రూ.2500 ఇవ్వకుండా మోసం చేసిందని మండిపడ్డారు. గిరిపుత్రులు నివాసమున్న ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఉందని, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ భీంరావ్ పాటిల్, ఇర్ల అభిలాష్, మునేశ్వర్ సోమన్న, రోహిదాస్, చిలుకూరి నరేందర్, చిన్నయ్య, మహేశ్, లక్ష్మణ్, సుంగన్న, బండు, భీం రాజ్, శంకర్ పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

తలమడుగు: మండలంలోని బరంపూర్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రత్యూష మాట్లాడుతూ.. విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదవాలన్నారు. ఎక్కడికి వెళ్లినా.. పాఠశాలను ఉపాధ్యాయులను గ్రామస్తులను మర్చిపోవద్దని సూచించారు. విద్యార్థులకు హాల్‌టికెట్లు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్సై

ఇచ్చోడ: ఆటోడ్రైవర్లు, ప్రైవేట్ వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై తిరుపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని సిరికొండ ఆటో అడ్డా వద్ద డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. వాహనాలకు తప్పనిసరిగా పత్రాలు ఉండాలన్నారు. రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేయవద్దని సూచించారు.

తాంసి: ఆటోలలో పరిమితి మించి ప్రయాణికులను తరలించవద్దని ఆటో డ్రైవర్లకు ఎస్సై రాధిక సూచించారు. మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లకు బుధవారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. వాహనదారులకు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. వారి వెంట సిబ్బంది శ్రీనివాస్, భాస్కర్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

సిరికొండ: వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలించవద్దని ఎస్సై శివారం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్ద ఆటో డ్రైవర్‌లకు అవగాహన కల్పించారు. రోడ్డు నిబంధనలు పాటించకుండా చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. అధిక లోడ్‌తో వాహనాలు నడపకూడదన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి

నార్నూర్: విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు అన్నారు. బుధవారం మండలంలోని మాన్కాపూర్ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే క్రమశిక్షణతో చదువుతూ తాము అనుకున్న లక్ష్య సాధన కోసం కష్టపడి చదవాలన్నారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ధన్ను, వార్డెన్ చౌహాన్ సుభాష్, నాయకులు ఆత్రం జలీమ్ సావ్, మెస్రం మోతిరం, కొట్నాక శ్రీరామ్ పాల్గొన్నారు.

ఊర పిచ్చుకల ఆవశ్యకతపై అవగాహన

ఆదిలాబాద్‌టౌన్: ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బుధవారం వైల్డ్ లైఫ్ ఫొటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ ముఖ్య అతిథిగా హాజరై పిచ్చుకల ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు. రాను రాను పిచ్చుకల సంఖ్య క్రమంగా తగ్గుతుందన్నారు. క్రిమి సంహారక మందుల వాడకం వలన పిచ్చుకలు మృత్యువాత పడుతున్నాయన్నారు. పిచ్చుకలను రక్షించుకునే బాధ్యత మన అందరిపై ఉందని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సంగీత, అధ్యాపకులు రడాపు సంతోష్ కుమార్, ఆనంద్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

ఉట్నూర్‌రూరల్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించాలని ఉట్నూర్ ఐడీబీఐ బ్రాంచ్ మేనేజర్ దాసరి మహేందర్ అన్నారు. బుధవారం ఐడీబీఐ ఉట్నూర్ బ్రాంచ్ ఆక్టివిటీలో భాగంగా ఉట్నూర్ జిల్లా పరిషత్ సెకండరి పాఠశాలకు ఆర్‌వో ప్లాంట్, పాఠశాల సౌకర్యార్థం ప్రింటర్ అందచేశారు. కార్యక్రమంలో మంచిర్యాల మేనేజర్ రాఘవేంద్రరావు, బ్యాంక్ సిబ్బంది రాంప్రసాద్, సునీల్, నజీర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థిని చితకబాదిన ప్రధానోపాధ్యాయుడు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఓ విద్యార్థిని ప్రధానోపాధ్యాయుడు చితకబాదాడు. బుధవారం పాఠశాల వద్ద బాధిత విద్యార్థి డాకురే చంద్రకాంత్, బంధువులు వివరాలు వెల్లడించారు. మండలంలోని హర్కపూర్ అంద్‌గూడ్ గ్రామానికి చెందిన డాకురే చంద్రకాంత్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎలాంటి కారణం లేకుండానే ప్రధానోపాధ్యాయుడు పిడిగుద్దులు గుద్దుతూ కాలుతో తన్నాడని ఆరోపించారు. బుధవారం ఉదయం బంధువులతో కలిసి పాఠశాలకు వచ్చాడు. ప్రధానోపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రానివాస్, రాందాస్, నికిల్, కేంద్రే బాలు తదితరులు పాల్గొన్నారు. ఈ విషయమై ప్రధానోపాధ్యాయుడు రామ్ మోహన్‌ను సంప్రదించగా.. వీడ్కోలు కార్యక్రమంలో ఆడపిల్లలు ఉన్నారని, ముగింపు సమయంలో బయట నుంచి యువకులు, పిల్లలు వస్తుండడంతో వారిని కట్టడి చేసే క్రమంలో కొంత కఠిన వ్యవహరించానని తెలిపారు. కొట్టిన విషయంలో వాస్తవం లేదని పేర్కొన్నారు.

బాలల కోసమే ‘డీసీపీయూ’



మాట్లాడుతున్న డీసీపీయూ కౌన్సిలర్ పద్మ

ఆదిలాబాద్‌రూరల్: బాలల కోసమే జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ పని చేస్తోందని డీసీపీయూ కౌన్సిలర్ పద్మ అన్నారు. బుధవారం అదిలాబాద్ పట్టణంలోని న్యూ హౌసింగ్ బోర్డ్‌లో గల తెలంగాణ బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో షర్ ఎన్జీవో ఆధ్వర్యంలో జిల్లా కోఆర్డినేటర్ వినోద్, ఫీల్డ్ సూపర్ వైజర్ కిరణ్‌తో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణ కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఎలాంటి సమస్యలున్నా.. 1098కు ఫోన్ చేస్తే సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. బాలిక హక్కుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపల్ మౌనిక, ఉపాధ్యాయులు స్వప్న, సునీత, ప్రణీత, సరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

కేఎస్ఆర్ ఆధ్వర్యంలో ఇఫ్తారు విందు



ఇఫ్తారు విందులో పాల్గొన్న కంది

కైలాస్‌నగర్: ప్రతిఒక్కరూ శాంతి, సామరస్యంతో మెలగాలని, కులమతాలకతీతంగా పండుగలను కలిసి మెలిసి ఆనందంగా జరుపుకోవాలని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరిస్తున్న ముస్లిం మైనార్టీలకు బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. స్థానిక ప్రజాసేవభవన్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముస్లింలు ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఉపవాసాలను విరమించారు. మౌలానా ఉస్మాన్ ఖాసిం, తవక్కల్, ఆరిఫ్ ఖాన్, ముజాహిదీన్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజానీ,జిల్లా ఖాజీ నదీం, అడ్వకేట్ గౌస్, నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి, షకీల్, అతీఖ్,రఫీ, ఖిజర్, నుస్రత్ పాల్గొన్నారు.

‘అవగాహనతోనే మోసాలకు చెక్’



కేక్ కట్ చేస్తున్న ఫోరం సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: చట్టాలపై అవగాహనతోనే మోసాలకు చెక్ పెట్టవచ్చని యాక్టీవ్ కన్జుమర్ ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎల్చల్‌వార్ సత్యనారాయణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్లో జరుగుతున్న మోసాలకు చెక్ పెట్టాలంటే ప్రతిఒక్కరూ వినియోగదారుల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అంతకుముందు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దుర్గం సుభాష్, లీగల్ అడ్వైజర్ నారాయణ యాదవ్, విశ్వనాథ్, మహేందర్ యాదవ్ పాల్గొన్నారు

సంక్షిప్త వార్తలు

టీషర్టులు పంపిణీ

బోథ్: సొనాల మండలంలోని పార్డి (బి) గ్రామంలో తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ద్వారా యువకులకు మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ టీషర్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇర్ల అభిలాష్, మారుతి, రోహిదాస్, భీంరావ్ పాటిల్, మునేశ్వర సోమన్న, నరేందర్, చిన్నయ్య, మహేశ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

బోథ్: సొనాల మండల కేంద్రానికి చెందిన బొంపాల పోశెట్టి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. కాగా బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ బుధవారం ఆయనను పరామర్శించి రూ. 5 వేల ఆర్థిక సాయం అందించారు.

- బోథ్ మండల కేంద్రానికి చెందిన అనిల్ అనే యువకుడు ఇటీవల ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కింద పడిపోవడంతో గాయపడ్డాడరు. విషయం తెలుసుకున్న స్థానిక గుల్జార్ మసీదు ట్రస్ట్ సభ్యులు బుధవారం ఆయనను పరామర్శించి రూ. 6 వేల ఆర్థిక సాయం అందించారు.

22న సంత వేలం

ఇచ్చోడ: ఈనెల 22న మేజార్ గ్రామ పంచాయతీ పరిధిలోని దినసంత, వారసంత, మేకల సంత, పశువుల సంతలతో పాటుగా పంచాయతీ అద్దె గదులకు వేలం వేయనున్నట్లు పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్ తెలిపారు. వేలంలో పాల్గొనే వారు కేవలం ఎస్టీ తెగకు చెందిన వారే అర్హులన్నారు. వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఎస్పీని కలిసిన పర్ధాన్ రిటైర్డ్ ఉద్యోగులు

ఆదిలాబాద్‌టౌన్: నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన అఖిల్ మహాజన్‌ను పర్ధాన్ రిటైర్డ్ ఉద్యోగులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించారు.

చట్టాలపై అవగాహన అవసరం

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని దక్కన్ గ్రామీణ బ్యాంక్ మున్సిపల్ కాంప్లెక్స్ బ్రాంచ్ ముఖ్య నిర్వహణ అధికారి అప్పారావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో బ్యాంకింగ్ సేవలు, పొదుపు పథకాలు, ఉద్యోగ అవకాశాలు, ఆన్‌లైన్ మోసాలు, జాగ్రత్తల గురించి వివరించారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

బోథ్: అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన బీఆర్ఎస్ నాయకులను బోథ్ ఎస్సై ప్రవీణ్ కుమార్ బుధవారం ముందస్తు అరెస్టు చేశారు. అక్రమంగా అరెస్టులు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్ని అరెస్టులు చేసినా కాంగ్రెస్ ప్రభుత్వంపై తమ పోరాటాన్ని ఆపబోమని హెచ్చరించారు.